క్లుప్తంగా

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

పీజీఆర్ఎస్‌లో వినతులు


సమస్యలు వింటున్న అధికారులు

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన ధోబీఘాట్ల వద్ద రస్తా సమస్యను పరిష్కరించాలని రజకులు, 80 బన్నూరు, చాబోలు, సిద్దేశ్వరం గ్రామాల దళిత, గిరిజనులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేష్‌బాబు, పొలాల రస్తా సమస్య, ఆన్‌లైన్‌లో తమ పేర్లు చేర్పులు, మార్పులు చేయించాలని పలు గ్రామాల రైతులు వినతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోపికృష్ణ, ఏఈలు నాగేంద్ర, బషీర్, ఏపీఓ రేష్మ పాల్గొన్నారు.

కాటేజీ నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో కాటేజీ నిర్మాణానికి సోమవారం మాజీ మంత్రి శిద్దా రాఘవరావు భూమిపూజ నిర్వహించారు. వీఐపీ కాటేజీ వద్ద కాటేజీ నిర్మాణ పనులకు అర్చకులు పూజలు నిర్వహించగా పనులు ప్రారంభించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు హాజరయ్యారు.

పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

పగిద్యాల: పడమర ప్రాతకోట సంతమార్కెట్ ఆవరణంలోని మండల పరిషత్ ప్రాథమిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు తగినట్లు మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్‌మజీద్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పాఠశాలను సందర్శించారు. గతంలో ఒకటి, రెండు తరగతులు నిర్వహించే పాఠశాలలో కూటమి ప్రభుత్వం వచ్చాక 3, 4, 5 తరగతులను చేర్చడంతో ప్రస్తుతం 100 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. అదనపు గదులు ఏర్పాటు చేసి, ఉపాధ్యాయులను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఐ మండల సహాయ కార్యదర్శి అబ్దుల్ కలాం తదితరులు ఉన్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయండి


పోస్టర్లను విడుదల చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ఆత్మకూరు: బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14న చలో బీసీ ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం శ్రీశైలం నియోజకవర్గ అధ్యక్షులు దబ్బి వెంకటస్వామిగౌడ్ కోరారు. పట్టణంలో బీసీ కార్యాలయంలో చలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు మన్యం బాలస్వామియాదవ్, వీరన్న, నాగరాజు, రమణ, పరమేశ్వరగౌడ్, మురళీకృష్ణ, పెద్దనాగన్న, డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పాటు

ఆత్మకూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్‌యార్డు అధికారులు తెలిపారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, చైర్మన్‌గా వంగాల వెంకటకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్‌గా నజీర్‌అహ్మద్‌తో పాటు కమిటీ సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

కుండపోత వర్షం

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- స్తంభించిన రాకపోకలు
- పంటపొలాల్లో చేరిన వర్షపు నీరు

నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లో కుండపోత వర్షం కురిసింది. సోమవారం వేకువజాము నుంచి ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంటపొలాలు వర్షపు నీటితో తాండవిస్తున్నాయి. గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో పల్లెల్లో రాత్రంతా చీకట్లు కమ్ముకున్నాయి.

118.2 మిల్లీమీటర్ల వర్షపాతం


వెలుగోడు-వేల్పనూరు రహదారిలో పొంగి ప్రవహిస్తున్న మంచినీళ్ల వాగు

వెలుగోడు: మండలంలో భారీ వర్షం కురిసింది. 118.2 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. వేల్పనూరు శివారులోని మంచినీళ్ల వాగు, మాధవరం నిప్పుల వాగు, వెలుగోడు ఊట కాల్వ ఉధృతంగా ప్రవహించడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వెలుగోడు సీపీ నగర్, గండిపేట, జమ్మినగర్ తండాలోని లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వర్షం నీరు వచ్చి చేరింది. రేగడగూడూరు, మాధవరం, మోతుకూరు తదితర గ్రామాల్లో రోడ్లు, పంట పొలాలు కోతకుగురయ్యాయి. వెలుగోడులో పంచాయతీ కార్యదర్శి నాగేంద్రగౌడు సిబ్బందితో కాల్వల్లో పూడిక తీయించి నీటిని బయటకు పంపించే చర్యలు చేపట్టారు. మండల అధికారులు ఘటనా స్థలాలకు చేరుకుని, సమస్యల పరిష్కార దిశగా చర్యలు ప్రారంభించారు. తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్, మండల అభివృద్ధి అధికారి మధుసూదన రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మల్లి నరేంద్ర, సిబ్బందితో కలిసి పరిస్థితిని పరిశీలించి, అవసరమైన పనులను ప్రారంభించారు. వ్యవసాయాధికారి నీట మునిగిన పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.


నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న వెలుగోడు ఏఓ స్వాతి

వేంపెంట గిరిజన గూడెం జలమయం


ఇంట్లోకి వర్షపు నీరు చేరడంతో మంచంపైనే ఉన్న గిరిజనులు

పాములపాడు: మండలంలో కుండపోత వర్షం కురిసింది. సోమవారం అర్ధరాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి మండలంలోని వేంపెంట చెంచు గిరిజన గూడెం జలమయమైంది. వర్షపు నీరు గుడిసెల్లోకి చేరడంతో గిరిజనులు రాత్రంతా జాగారణ చేశారు. అయినా మండల అధికారులు గానీ, ఐటీడీఏ అధికారులు గానీ గూడెం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. కాగా మండలంలో 98.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. నెల రోజుల ఉంచి చినుకు జాడ లేదు. ఈక్రమంలో భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పొంగిన భవనాశి, సుద్దవాగు


ఆత్మకూరు: నిండుకుండలా ప్రవహిస్తున్న భవనాశి నది

ఆత్మకూరు: నల్లమలలో భారీ వర్షం కురవడంతో భవనాశి, సుద్దవాగులు పొంగి ప్రవహించాయి. మరోవైపు మండలంలో 52.8 మి.మీ. వర్షం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆత్మకూరు సమీపంలోని గుండ్లకమ్మవాగు స్వల్పంగా ప్రవహించింది. సిద్ధాపురం చెరువుకు భారీగా వరదనీరు రావడంతో నిండుకుండలా కనిపిస్తోంది. పట్టణ శివారు కాలనీలో వర్షపునీరు నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత జూలై 18న 62.4 మి.మీ. వర్షపాతం నమోదు కాగా మరోసారి 52.8 మి.మీ వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.


ఆత్మకూరు: పంట పొలాల్లో నిలిచిన వర్షపునీరు


వర్షపు నీటిలో గిరిజన గూడెం

పోటెత్తిన కుందూ

బండి ఆత్మకూరు: ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి కుందూ నది పోటెత్తింది. 94.4 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో మండలంలోని పలు గ్రామాల వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. మండలంలోని కుందూ నది పరివాహక గ్రామాలు భోజనం, సంతజూటూరు, బండి ఆత్మకూరు, కాకనూరు పరిధిలోని పొలాలు పూర్తిగా జలమయమయ్యాయి. కుందూ నది ఒడ్డునే ఉన్న ప్రభుత్వ మోడల్ స్కూల్ చుట్టూ నీరు చేరడంతో తహసీల్దార్ పద్మావతి, ఎంఈఓ మోహన్ రెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణవేణి అక్కడికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. నీటి మట్టం పెరుగుతుండటంతో పాఠశాలకు సెలవులు ఇచ్చి విద్యార్థులను ఇళ్లకు పంపారు.


జలమయమైన మోడల్ స్కూల్‌ను పరిశీలిస్తున్న అధికారులు


తర్తూరు పొలాలకు వెళ్లేదారిలో ఉప్పొంగి ప్రవహిస్తున్న సుద్దవాగు


పొలాల్లో నిలిచిన వర్షం నీరు

రహదారులను ముంచెత్తిన వర్షపు నీరు

జూపాడుబంగ్లా: మండలంలోని సుద్దవాగు, ఇసుక వాగు, కాకిలేరు ఉప్పొంగి ప్రవహించగా తర్తూరు ప్రధానరహదారిని వర్షపు నీరు ముంచెత్తింది. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు తర్తూరు, జూపాడుబంగ్లా, పారుమంచాల, పి.లింగాపురం, తరిగోపుల, తూడిచెర్ల, పోతులపాడు, తాటిపాడు, మండ్లెం, తదితర గ్రామాల్లో కురిసిన భారీ వర్షం 94.8 మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు.

– **పగిద్యాల:** మండలంలో 46.8 మిల్లీమీటర్ల వర్షం కురినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. లక్ష్మాపురంలోని సుద్దవాగు, చిన్నెద్దుల వంక వాగు, పగిద్యాలలో నల్లవాగు పొంగిపొర్లాయి.

– **మహానంది:** మండలంలో 40.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మహానంది పుణ్యక్షేత్రంతో పాటు పరిసర గ్రామాల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు వర్షం కురిసింది. కాగా శ్రావణమాసం శుభ ముహూర్తాలకు నెలవు కావడంతో శుభ కార్యక్రమాలు చేసుకునే వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం కారణంగా ఆలయం ముందు ఉన్న సుపథ మండపాల్లో వివాహాలు చేసుకున్నారు.

మద్దిగుండం చెరువుకు గండి


పంట పొలాలలోకి పారుతున్న మద్ది గుండం చెరువు నీరు


పట్టణంలో కూలిన మట్టి మిద్దె

నందికొట్కూరు: ఉరుములతో, మెరుపులతో కూడిన భారీ వర్షం సోమవారం వేకుజామున నుంచి ఉదయం వరకు కురిసింది. ఫలితంగా 131.04 మి.మీ వర్షపాతం నమోదైంది. మురుగు కాలువలు సరిగా లేకపోవడంతో పట్టణంలోని రహదారులపై మురుగు నీరు ఎక్కిపారింది. పింజరిపేటలో సిద్దయ్యకు చెందిన పాత మట్టి మిద్దె కూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మిడుతూరు మండలంలో 68.04 మి.మీ వర్షం కురిసింది. మదిగుండం చెరువు వద్ద తూం గండి పడింది. గండి పూడ్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు నీరంతా పొలాల్లో పారడంతో పైర్లు దెబ్బతింటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిడుతూరు మండలంలో కురిసిన వర్షం నీరు మారుతీనగర్‌లోకి ప్రవహిస్తున్న నీరు, రహదారులను, డ్రైనేజీలను మున్సిపల్ కమిషనర్ బేబి, డీఈ నాసీర్, ఏఈ దినేష్‌కుమార్, నేషనల్ హైవే డీఈ రాముడు పరిశీలించారు.


వీరాపురం వద్ద మొక్కజొన్న పొలంలో వర్షపునీరు నిలిచిన దృశ్యం


గువ్వలకుంట్ల సమీపంలో వరిపొలాల్లో నిలిచిన వర్షపునీరు

నీట మునిగిన పంట పొలాలు

కొత్తపల్లి: మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు భారీ వర్షానికి పంట పొలాలు నీట మునిగాయి. 90.8 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో నీరంతా వరి, మొక్కజొన్న పంటల్లో చేరింది. రోడ్లపై ఎక్కి పారింది. నందికుంట – ఆత్మకూరు ప్రధాన రహదారి, బస్టాండ్ నుంచి ఎస్సి, బీసీ, ఓసీ కాలనీలకు వెళ్లే రహదారులలో మోకాళ్లలోతు నీరు చేరింది. బావాపురం సెంటర్, కొత్తపల్లి బీసీ, ఓసీ కాలనీల రోడ్లు నీటితో నిండిపోయాయి. సంగమేశ్వరం-ఆత్మకూరు ప్రధాన రహదారిలో ఎం.లింగాపురం గ్రామంలో రోడ్డుపై నీరునిలిచి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గువ్వలకుంట్ల ఎస్సీ కాలనీలో ఎంపీపీ స్పెషల్‌స్కూల్ ఆవరణంలో వర్షపునీరు నిలిచి విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

పంచమఠాలలో విశేష పూజలు


రుద్రాక్షమఠం వద్ద పూజల్లో పాల్గొన్న దేవస్థాన ఈఓ


పంచమఠాలలోని స్వామివారికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో లోకకల్యాణార్థం పంచమఠాలలో విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించారు. సోమవారం ఉదయం భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠాలలో పూజాదికాలు జరిపించారు. ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు జరిపారు. అనంతరం అన్ని మఠాలలో సంప్రదాయబద్దంగా అభిషేకాది అర్చనలను నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఏఈఓ హరిదాసు తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం..


డప్పుల వాయిద్యాలతో నిండుబిందెలతో నీరు తెస్తున్న రైతులు

పాములపాడు: వరుణుడి కరుణ కోసం మండల కేంద్రానికి చెందిన రైతులు సోమవారం ఆలయాల్లో జలాభిషేకాలు నిర్వహించారు. నెల రోజులుగా చినుకు జాడ లేక పైర్లు ఎండిపోతుండటంతో ముందుగా శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ దేవతలకు జలాభిషేకాలం చేశారు. డప్పులతో బావులు, బోర్ల వద్ద నుంచి బిందెలతో నీరు తెచ్చి దేవుళ్లకు జలాభిషేకం చేశారు. కాగా సోమవారం కార్యక్రమానికి చేయాలని నిశ్చయించుకోగా ఆదివారం అర్ధరాత్రి నుంచే వరుణ దేవుడు కరుణించాడని మండల కేంద్రం వాసులు ఆనందంతో పరవశించి, ఉత్సాహంగా జలాభిషేకంలో పాల్గొన్నారు.

రేపు పంచాయతీల పురోగతిపై శిక్షణ

జూపాడుబంగ్లా: ఈనెల 13న పంచాయతీల పురోగతిపై మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులకు ఒక్కరోజు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కార్యక్రమంలో పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చించి ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత


నామినీకి చెక్ అందజేస్తున్న మేనేజర్ శ్రీకాంత్

నందికొట్కూరు: బాధిత కుటుంబానికి బ్రాహ్మణకొట్కూరు ఇండియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్ సోమవారం బీమా చెక్కు అందజేశారు. బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి చెందిన ఎస్.బాషా ఇండియన్ బ్యాంక్‌లో ఖాతాదారుడు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన(పీఎంఎస్‌బీవై) కింద రూ.436ల ప్రీమియం చెల్లించేవాడు. ఇటీవల బాషా ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అతని భార్య ఎస్ నజీమా నామినీగా ఉండటంతో ఆమెకు రూ.2 లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్స్ నాగార్జున, రియాజుద్దీన్, ఎస్ఎస్ సంస్థ పీడీ ఆంజనేయులు పాల్గొన్నారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వర దంపతులు

మహానంది: మహానందీశ్వర దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఆలయ వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్థానిక అలంకార మండపంలో మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను అలంకరించారు. గణపతి పూజ, అలంకార హారతులు ఇచ్చి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుంచారు. ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం కనుల పండువగా సాగింది. ధ్వజస్తంభం వద్ద హారతులు ఇచ్చి పూజలు నిర్వహించి ఉత్సవ మూర్తులను తిరిగి యథాస్థానానికి చేర్చారు.

సమస్యలను పరిష్కరించాలి

ఆత్మకూరు: పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యులు యేసురత్నం డిమాండ్ చేశారు. పట్టణంలోని హమాలీ యూనియన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఏ వీధి చూసినా మురుగు నీరు ప్రవహిస్తూ అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తోందన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో చిన్నపాటి వర్షాలకే కాలనీలు జలమయమవుతున్నాయన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి మురుగు కాలువలను మెరుగుపరిచి, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు హుసేన్, రజాక్, రణధీర్, షఫీవుల్లా, రహీం, రోషన్‌వలీ పాల్గొన్నారు.

అవి-ఇవి

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 13న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ తిరుపాలమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్న సమావేశంలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రధాన సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెలుగులోకి తేవాలన్నారు. కార్యక్రమానికి మండల పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయండి

కొత్తపల్లి: రానున్న నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు ఉండటంతో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ ఉమారాణి అధికారులకు సూచించారు. సోమవారం ఆమె గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశమై పలు సూచనలు చేవారు. మట్టి మిద్దెల్లో ఉండే ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

దేశభక్తిని పెంపొందించుకోవాలి

పగిద్యాల: ప్రతి పౌరుడు దేశభక్తిని పెంపొందించుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు పుల్యాల దివ్య సూచించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపీడీఓ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి బస్టాండుకు చేరుకుని మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే దేశభక్తిని కలిగి ఉండేలా ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ, తహసీల్దార్ శివరాముడు, ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్(సర్వే) మురళీ, పంచాయతీ కార్యదర్శి వీరన్నయాదవ్ పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

నందికొట్కూరు: దేశవ్యాప్తంగా ఓట్ల తొలగింపునకు పాల్పడుతున్న బీజేపీకి వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధం కావాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల్లో బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించి దేశంలోని మరోసారి అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందన్నారు. రాబోయే రోజుల్లో ఆంధ్రపదేశ్‌లో కూడా ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని, ప్రజలు తిప్పికొట్టేందుకు సిద్ధం కావాలని కోరారు. స్వాతంత్ర్యం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి నినాదాలతో ఈనెల 15వ తేదీ వరకు ఆందోళనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బీబీ, లక్ష్మీదేవి, ముర్తుజాబి, పార్వతమ్మ, సుధాకర్, మాబాషా, ఏసన్న, గణేష్, మధుకుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నందికొట్కూరు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ ఎస్ఐ తిరుపాలు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కోనేటమ్మపల్లి గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. రహదారులపై వాహనదారులు నిదానంగా ప్రయాణం చేయాలని కోరారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

ఆత్మకూరు: భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న పట్టణంలోని ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు సూచించారు. పట్టణంలో సోమవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం కోసం అతి పెద్ద దేశంలో స్వాతంత్ర్య దినోత్సవాలను నిర్వహించుకోవడం విశేషమన్నారు. జాతీయ నాయకుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన స్వాతంత్ర్య దినోత్సవాన్ని, జాతీయ జెండాను ప్రతిఒక్కరూ గౌరవించాలన్నారు. అంతకుముందు పట్టణంలోని గౌడ్‌సెంటర్, కొత్త బస్టాండు, నంద్యాల టర్నింగ్ ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు.

సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

కొత్తపల్లి: ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం చేయవద్దని ఎమ్మెల్యే గిత్త జయసూర్య అధికారులకు సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమారాణి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అల్లాం బాషా, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, ఏపీఎం పుల్లయ్య, ఏపీఓ విమలమ్మ పాల్గొన్నారు.